సాక్షి ప్రకాశం

సోమవారం । 27 । నవంబర్ । 2023



సమ్మెటివ్-1లో టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు

ఈనెల 28 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహించనున్నారు. - 8లో..



బీసీల పక్షపాతి సీఎం జగన్

బీసీల పక్షపాతి సీఎం జగన్ అని, రానున్న ఎన్నికల్లో బీసీలంతా ఆయనకు అండగా ఉండాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30.7/25.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

నేడు బాధ్యతలు తీసుకోనున్న సబ్ రిజిస్ట్రార్లు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లు సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రామకృష్ణ ప్రత్యేకంగా ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు ప్రకాశం జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(ఎఫ్‌ఏసీ) వి.కిరణ్ కుమార్ జిల్లాలో సస్పెండైన సబ్ రిజిస్ట్రార్ల స్థానంలో ముగ్గురిని నియమిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపుల కుంభకోణంలో చేస్తున్న సిట్ దర్యాప్తులో భాగంగా జిల్లాలోని పలువురు సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు చేపట్టారు. సస్పెండైన వారిలో ఒంగోలు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ ఆర్.వి.రమణ కుమార్, ఒంగోలు జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ వి.రామకృష్ణ, యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్ కే.జ్ఞాన సుందర రాజు ఉన్నారు. అంతకు ముందు సీనియర్ అసిస్టెంట్ కృష్ణ మోహన్‌రావును సస్పెండ్ చేశారు. జిల్లాలో నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపులు, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, నకిలీ సర్వే సర్టిఫికెట్లు, నకిలీ కన్వర్షన్ సర్టిఫికెట్ల బండారం బయటపడి రిజిస్ట్రేషన్ శాఖను ఒక్క కుదుపు కుదిపింది. సస్పెండైన వారి స్థానాల్లో సింగరాయకొండ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న చేతల శ్రీనివాసరావును ఒంగోలు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా, చీమకుర్తిలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏ.వాసుదేవ రెడ్డిని ఒంగోలు జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. అదేవిధంగా సింగరాయకొండకు ఒంగోలు డీఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ జి.ఫాతిమాను కేటాయించారు. చీమకుర్తిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అశ్విత తేజకు అక్కడే సబ్ రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా యర్రగొండపాలెంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వీర కుమార్‌కు సబ్ రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరందరూ సోమవారం ఆయా కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

పేదల ప్రాణదాత

- నిరుపేదల ఆరోగ్యానికి రక్షణగా ఆరోగ్యశ్రీ
- కార్పొరేట్ వైద్యం ఉచితంగా ప్రజల చెంతకు
- మెరుగైన చికిత్సతో పునర్జన్మ పొందిన లక్షలాది మంది
- సీఎం జగన్‌ను మరువలేమంటూ కృతజ్ఞతలు తెలుపుతున్న లబ్ధిదారులు
- జిల్లాలో 58 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు

పేద..మధ్యతరగతి ప్రజలకు అనుకోకుండా ఏదైనా పెద్ద అనారోగ్య సమస్య వస్తే ఆరోగ్యశ్రీ పథకం ఆపద్బాంధవిలా ఆదుకుంటోంది. గతంలో కంటే మరిన్ని సేవలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవడంతో ఎక్కువ మంది ఆపత్కాలంలో ఉచితంగా వైద్యం పొందేందుకు అవకాశం కలిగింది. నిత్యం వేలాది మంది జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ పథకం కింద చికిత్స పొంది స్వస్థత పొందుతున్నారు. పరిపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా ఇంటికి చేరి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేలు మరువలేమంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

•••

మద్దిపాడు:

పేద ప్రజలు అనారోగ్యం పాలై మెరుగైన వైద్యం చేయించుకోవాలంటే గతంలో అప్పులు చేయాల్సి వచ్చేది. కార్పొరేట్ వైద్యం వారికి అందని ద్రాక్షగా ఉండేది. ఆ సమయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు కూడా కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. తరువాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పలు రోగాలను ఆ పథకం నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ఆవశ్యకతను గుర్తించి 3257 రకాల జబ్బులను ఈ పథకంలో చేర్చారు. ప్రతి పేదవానికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వ్యాధులకు చికిత్సలు పొందే అవకాశాన్ని కల్పించారు. పథకాన్ని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించి ఆస్పత్రులను పర్యవేక్షించేలా పలు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 58 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో ఎక్కడైనా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందవచ్చు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మంది చికిత్సలు చేయించుకుని బాగుపడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆనందంగా ధన్యవాదాలు తెలుపుతున్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని రోగులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్య శ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్ (ఫైల్)



ఇంకొల్లులో క్యాన్సర్ వ్యాధికి చికిత్స చేయించుకున్న లక్ష్మీరాజ్యంను పరామర్శిస్తున్న స్పెషల్ ఆఫీసర్ (ఫైల్)

ఆరోగ్యశ్రీ నడిపించింది..



చాలా కాలంగా నడుము పట్టేసి పైకి లేవలేని పరిస్థితి. ఎవరో ఒకరు తోడు ఉండాల్సిందే. పనులు మానుకుని నాలాంటి వృద్ధురాలికి రోజూ ఎవరు తోడుంటారు. బతకడమే ఇబ్బందికరంగా మారిన పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేస్తారని ఆశా వర్కర్లు చెప్పారు. దీంతో ఆస్పత్రిలో చేరాను. రూ.4 లక్షల విలువైన ఆపరేషన్ ఉచితంగా చేయించారు. ప్రస్తుతం నా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. జగనయ్యకు నాబోటి ముసలి వాళ్ల దీవెనలు మెండుగా ఉండాలని ఆ దేవుడిని ప్రార్థిస్తాను.

– మేకల విశ్రాంతం, లింగోజీపురం, కనిగిరి మండలం

నిరుపేదలకూ కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం



ప్రతి పేదవాడిని వైద్యం అందక ఇబ్బందులు పడే పరిస్థితి నుంచి బయటకు తీసుకురావడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకంలో గతంలో వెయ్యిలోపు ఉన్న జబ్బులను 3257 వరకూ పెంచారు. నిరుపేదలకు కూడా కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య శ్రీ స్పెషల్ ఆఫీసర్‌గా నన్ను నియమించారు. శక్తి వంచన లేకుండా ప్రతి ఆస్పత్రిని పరిశీలిస్తూ వైద్యం సక్రమంగా అందేలా పర్యవేక్షిస్తున్నాను. లక్షలాదిగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. సేవల విషయంలో ఎక్కడా లోపం జరగకుండా చూస్తున్నాను. సహాయం అందించడానికి నేను, నా సిబ్బంది ప్రతి క్షణం సిద్ధంగా ఉంటాం. అత్యవసరమైతే నాకు ఫోన్ చేయవచ్చు. నా సెల్ నంబర్: 9866641053.

– యాదాల అశోక్‌బాబు, రాష్ట్ర ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్

ఆరోగ్యశ్రీతో గుండె పదిలం



నాకు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. మా ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే. ఆశా కార్యకర్తలు ఆరోగ్యశ్రీ పథకం గురించి చెప్పడంతో ఆస్పత్రిలో చేర్పించారు. రూ.3 లక్షల విలువ చేసే చికిత్స చేసి గుండెకు స్టంట్ వేశారు. ప్రస్తుతం నా ఆరోగ్యం కుదుటపడి పనులు చేసుకోగలుగుతున్నాను. పేదవాడికి కూడా కార్పొరేట్ వైద్యం చేయిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– మునలయ్య, అనకర్లపూడి, కొండపి మండలం

క్యాన్సర్ నుంచి కాపాడారు



నాకు క్యాన్సర్ వచ్చింది. ఆర్థికంగా పెద్దగా స్థోమతలేని కుటుంబం మాది. ఏం చేయాలని బాధపడుతున్న సమయంలో ఆశా వర్కర్ ఆరోగ్యశ్రీ పథకం గురించి చెప్పి నాకు సహాయపడింది. ఆ పథకం కింద క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందించడంతో పాటు కీమో థెరపీ చేయించుకున్న ప్రతిసారీ రూ.5 వేలు చొప్పున ఆసరా కల్పించారు. మందులు ఉచితంగా ఇచ్చారు. 17 సార్లు కీమోథెరపీ చేయించుకున్నాను. ప్రస్తుతం వ్యాధి నుంచి కోలుకుని నా కుటుంబంతో ఆనందంగా ఉన్నాను. నాకు, మా కుటుంబానికి మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరువలేం.

– అంజమ్మ, మద్దిపాడు

కష్టకాలంలో ఆదుకున్నారు



మాది దిగువ మధ్య తరగతి కుటుంబం. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నేను వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించుకున్నాను. రూ.3 లక్షలు ఖర్చయ్యే చికిత్సను ఉచితంగా చేశారు. ప్రతినెలా డయాలసిస్ చేయించుకోవడానికి నెలకు రూ.10 వేల పెన్షన్ కూడా ఇస్తున్నారు. కష్ట కాలంలో నన్ను ఆదుకున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నా.

– మోహనరావు, పోతవరం, నాగులుప్పలపాడు మండలం

మాగుంట సుబ్బరామిరెడ్డి సేవలు మరువ లేనివి

- ఘనంగా మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతి వేడుకలు



మాగుంట కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మాగుంట విజయ్‌బాబు, నాయకులు

ఒంగోలు సెంట్రల్: దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. సుబ్బరామిరెడ్డి 76వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయనకు ఘన నివాళులర్పించి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పట్టణంలో పలు చోట్ల సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాగుంట సుబ్బరామిరెడ్డి కుమారుడు మాగుంట విజయబాబు ఆయా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ముందుగా మాగుంట కార్యాలయంలో సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. అభిలాష్ హోటల్ సెంటర్ వద్ద, రైల్వే స్టేషన్ రోడ్‌లో, అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, ఎంపీపీ కుమారస్వామి రెడ్డి, నాయకులు ఆత్మకూరి బ్రహ్మయ్య, గొర్రెపాటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లం సత్యనారాయణ, కార్పొరేటర్ పసుపులేటి శ్రీనివాసరావు, కుందం హనుమారెడ్డి, సహకార సంఘ చైర్మన్ వాకా రంగారెడ్డి, యత్తపు కొండారెడ్డి, వాకా సంజీవరెడ్డి, కొర్రపాటి శ్రీనివాసరావు, చిత్తమూరి శ్రీనివాస రెడ్డి, నలమలపు నరసారెడ్డి, సయ్యద్ ఇస్మాయిల్, కాకుమాను సాగర్, షేక్ జిలాని, చుండి దేవదాసు, వాయల మోహన్‌రావు, చిలకపాటి క్రిష్ణయ్య, చిలపి శ్రీనివాసరెడ్డి, రాజకుమార్, అయినాబత్తిన కిట్టు, డీఆర్‌యూసీసీ మెంబర్ నాదెండ్ల సుధాకర్, వాకా బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ జాతి సంపద

- మహానేతల భావజాలాలు పుణికి పుచ్చుకున్న జగనన్న
- అంబేడ్కర్ ఆశయాల మేరకు రాష్ట్రంలో బడుగులకు సంక్షేమ ఫలాలు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత నాయకుడు మాత్రమే కాదని, ఆయన జాతి సంపదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో రూ.130 కోట్ల జనాభా ఉన్న ఈ దేశానికి రాజ్యాంగం రాసి దేశ ప్రజలకు అంకితం ఇచ్చిన నవభారత రాజ్యాంగ నిర్మాత, రాజకీయ దురంధరుడు, పరిపాలన దక్షుడు, అపరమేధావి, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను ప్రపంచ దేశాలన్నీ కొనియాడుతున్నాయని అన్నారు. ఫెడరల్ గవర్నమెంట్ వ్యవస్థను 78 ఏళ్ల పాటు మనం బతికించుకోగలిగామంటే దానికి కారణం రాజ్యాంగమని, ఇప్పటి వరకు 100కుపైగా సవరణ చేసుకున్నా సుస్థిరంగా ప్రజాస్వామ్యం విరాజల్లుతుందంటే అందుకు కారణం ఒక కంస్ట్రీ బంధం మన అందరినీ భిన్నత్వంలో ఏకత్వమేనని అన్నారు. పొరుగు రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యం వీగిపోయి మిలిటరీ పరిపాలన వచ్చి, మానవ హక్కులు హరించిపోయి, దళిత, బడుగు, బలహీన వర్గాలకు సమానత్వం లేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఇటువంటి పరిస్థితుల్లో మన రాష్ట్రం విరాజిల్లుతుందంటే రాజ్యాంగ బద్ధంగా పరిపాలన చేసిన నాయకులు ఉండటమే అందుకు కారణమని అన్నారు.

మహానేతల భావజాలాలు పుణికి పుచ్చుకున్న జగనన్న:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం, జ్యోతి రావ్ పూలే, ఛత్రపతి సాహు మహరాజ్‌ల ఆలోచన విధానం, భావజాలాన్ని పుణికి పుచ్చుకొని రాజ్యాంగబద్ధంగా ముఖ్యంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎక్కడా వివక్ష లేకుండా పాలన అందిస్తున్నారని మంత్రి అన్నారు. బడుగు, బలహీన వర్గాలు, దళిత, మైనార్టీ వర్గాలు అభివృద్ధిలోకి రావాలంటే పార్టీలు, కులాలు, మతాలు చూసుకుంటూపోతే కుదరదని, వీటన్నిటికీ అతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందించాలని ఆలోచించి జగన్‌మోహన్ రెడ్డి సాధికారితవైపు అడుగులు వేస్తూ చేయిపట్టుకొని ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. 125 అడుగుల ఎత్తు బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రూ.వేల కోట్లు విలువచేసే విజయవాడ నడిబొడ్డున ఉన్న స్థలంలో రూ.400 కోట్ల ఖర్చుతో సీఎం జగనన్న ప్రతిష్ఠింపచేస్తున్నారని అన్నారు. ఈ విగ్రహం 2024 జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భంగా ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, దళిత, బలహీన, బడుగు వర్గాల స్థానం ఎక్కడంటే జగనన్న గుండెల్లో ఉందని ఆయన అన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ కలలు నెరవేరుతున్నాయని, దళితులకు పూర్తిగా స్వతంత్రం, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం, సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వారికి సాధికారత లభించిందని అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో 20 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కె.జయరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములునాయక్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, దోర్నాల నాయకులు ఎస్.వెంకటరెడ్డి, ఏకుల మునలారెడ్డి, బి.బాలచెన్నయ్య, పబ్బిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు

- భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు



అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజును పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత దివంగత నేత డాక్టర్ వైఎస్సార్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశానికి అంబేడ్కర్ చేసిన సేవల గురించి వివరించారు. అనంతరం స్థానిక హెచ్‌సీఎం కాలేజీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన మేయర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, బీసీ విభాగం జిల్లా పార్టీ అధ్యక్షుడు గోలి తిరుపతి రావు, ఒంగోలు నగర పార్టీ అధ్యక్షుడు కఠారి శంకర్, కార్పొరేటర్లు శ్రీరాం నాగభూషణం బెంగళూరు నర్సయ్య, గంగవరపు ప్రవీణ్ కుమార్, కొమ్మూరి రవిచంద్ర, చింతగుంట్ల సువర్ణ, కరీముల్లా, చావల శ్రీనివాసులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

తెలుగుభాష పరిరక్షణకు కృషి చేయాలి



భువనచంద్రను పురస్కారంతో సత్కరిస్తున్న కవులు, రచయితలు, సాహిత్యవేత్తలు

- సినీ గేయ రచయిత భువనచంద్ర
- భువనచంద్రకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

ఒంగోలు మెట్రో: తెలుగు భాష పరిరక్షణకు అందరూ తమ వంతు కృషి చేయాలని సినీ గేయ రచయిత భువనచంద్ర అన్నారు. కళామిత్ర మండలి, తెలుగు లోగిలి జాతీయ సంస్థ 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఉదయం ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించగా, సినీ గేయ రచయిత భువన చంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన్ను నూనె వెంకాయమ్మ, వెంకటరత్నం స్మారక జీవన సాఫల్య పురస్కారంతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అలాగే కళామిత్ర మండలి ఇస్తున్న జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలను వివిధ రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి వచ్చిన ప్రముఖ సాహితీవేత్తలు, కవులు 27 మందికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భువన చంద్ర మాట్లాడుతూ తెలుగు భాషను సుసంపన్నం చేస్తున్న కవులు, రచయితలు, సాహితీమూర్తులను ఒంగోలుకు రప్పించి ఇలా అవార్డులతో సత్కరించటం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, కళా మిత్రమండలి అవార్డ్స్ కమిటీ చైర్‌పర్సన్ తేళ్ల అరుణ, సాహితీ పోషకులు వీరవల్లి సుబ్బారావు రుద్రయ్య, శ్రేయ రియల్ ఎస్టేట్ చైర్మన్ కె.బాబు ఆగస్టస్, కృష్ణా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జి.వి.పూర్ణచందు, ప్రముఖ సంగీత విద్వాంసులు, సాహితీవేత్త డా.భూసురపల్లి వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ప్రెసిడెంట్ లయన్ వెన్నపూస శ్రీరాములురెడ్డి, శ్రీ నారాయణ విద్యా సొసైటీ చైర్మన్ కొల్లా నారాయణ రావు, కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జున రావు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, నూకతోటి శరత్ బాబు, డా.మున్నంగి రాజకుమారి తదితరులు ప్రసంగించారు.

డాక్టర్ నాగభైరవ, డాక్టర్ మండవ నరసింహారావు స్మారక సాహితీ ప్రతిభా పురస్కారాన్ని ఒంగోలుకు చెందిన శేషగిరీశంకు ఇచ్చారు. సింహాద్రి స్మారక సాహితీ పురస్కారాన్ని తేళ్ల అరుణకు, తన్నీరు కోటయ్య స్మారక సాహితీ ప్రతిభా పురస్కారాన్ని డాక్టర్ నాగభైరవ ఆదినారాయణకు, వేదాల జగన్నాథాచార్యులు కళామిత్ర రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలను చిరంజీవి, శంతన, కొప్పోలు వెంకటేశ్వర్లు అందుకున్నారు. ముందుగా చందు డాన్స్ అకాడమీ విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



ఒంగోలులో కొండమీద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న భక్తులు



ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక కాంతులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలన్నీ దీపాలతో, జ్వాలాతోరణాలతో కాంతులీనాయి. మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. - మరిన్ని చిత్రాలు 8లో

సమన్యాయం కోసం రాజ్యాంగం

- జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు

ఒంగోలు సెంట్రల్: సామాజిక, రాజకీయ, ఆర్థిక విద్యారంగాల్లో ప్రజలందరికీ సమన్యాయం, కోసం దూరదృష్టితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు పేర్కొన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా స్థానిక హెచ్‌సీఎం కాలేజీ, అంబేడ్కర్ భవన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగమే ప్రధాన బలమని అన్నారు. ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమైన రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26ను ఏటా రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు. కలెక్టరేట్‌లోని కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ టి.రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుడికి రూ.లక్ష టోకరా

మార్కాపురం: ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుడు లక్ష రూపాయలు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే..పెద్దారవీడు మండలంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఇటీవల తన మిత్రునికి పోస్టల్ పార్శిల్‌లో ఒక బుక్ పంపాడు. ఆ బుక్ తనకు చేరలేదని సమాచారం అందడంతో ఆదివారం ఉదయం ఆ ఉపాధ్యాయుడు ఆన్‌లైన్‌లో కనిపించిన ఓ నంబర్‌కు ఫోన్ చేశాడు. అవతల వైపు నుంచి ఓ వ్యక్తి మీ రిక్వెస్టును ఇప్పుడే ఫార్వర్డ్ చేశామని, రూ.2 పంపాలని లింకు పంపాడు. దీంతో సదరు ఉపాధ్యాయుడు రెండు రూపాయలు పంపిన వెంటనే వివిధ అకౌంట్లలో ఉన్న రూ.లక్ష నగదు డ్రా అయినట్లుగా సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్నాడు. సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు సదరు ఉపాధ్యాయుడు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఆరోగ్యమిత్ర మృతి


రాంబాబు మృతదేహం


దర్శనం రాంబాబు(ఫైల్)

పెద్దదోర్నాల: నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యమిత్రగా విధులు నిర్వహిస్తున్న దర్శనం రాంబాబు (40) మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. ద్విచక్ర వాహనం పంచర్ కావటంతో ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న రాంబాబును ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలైన రాంబాబును వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన యువకుడు మరో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు పూర్తి స్థాయిలో తెలియాల్సి ఉంది.

కారుబోల్తా పడి యువకుడు మృతి


కారు ప్రమాదంలో మృతి చెందిన ప్రసన్నాంజనేయులు

అద్దంకి రూరల్: కారు బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. బల్లికురవ మండలం కొప్పరపాడు గ్రామానికి చెందిన తన్నీరు ప్రసన్నాంజనేయులు (30) మారెళ్లలో ఉన్న తన భార్యవద్దకు కారులో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి బోల్తా కొట్టి పొలాల్లోకి దూసుకువెళ్లింది. ఈప్రమాదంలో ప్రసన్నాంజనేయులు అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

టెన్నికాయిట్ జిల్లా చైర్మన్‌గా 'తాడివలస'


జిల్లా టెన్నికాయిట్ చైర్మన్‌గా ఎన్నికైన దేవరాజ్‌తో రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

చీరాల టౌన్: జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ చైర్మన్‌గా చీరాలకు చెదిన తాడివలస దేవరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ సెక్రటరీ సత్యనారాయణ ఆదేశాల మేరకు దేవరాజ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాపట్ల డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా టెన్నికాయిట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ చైర్మన్‌గా దేవరాజ్, ఇతర సభ్యులను ఎన్నుకుని నియామక పత్రాలు అందించారు. దేవరాజ్‌ను పురప్రముఖులు, పలువురు క్రీడాకారులు అభినందించారు.


మార్కాపురం మార్కండేశ్వర ఆలయంలో ప్రత్యేక అకర్షణగా శివుని ప్రతిమ


త్రిపురాంతకం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం


మార్కాపురం శివాలయంలో జ్వాలాతోరణం

కార్తీక కాంతులు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శైవ క్షేత్రాల్లో జ్వాలాతోరణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. జ్వాలా తోరణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.


త్రిపురాంతకం ఆలయం వద్ద అఖండ జ్యోతి


చీమకుర్తి శివాలయంలో జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తదితరులు


చీమకుర్తి హరిహర క్షేత్రంలో జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్‌కుమార్, కుటుంబ సభ్యులు

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్


సమైక్యతా నినాదంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, బీసీ సంఘాల నేతలు


కార్తీక వన మహోత్సవంలో బీసీవర్గాల ప్రజలు

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి బీసీలంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్సిటీ బోర్డు మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర స్వామి గుడిలో బీసీల ఐక్య వేదిక (139 కులాల) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కార్తీక వనభోజనోత్సవ సభ పల్లా మాలకొండయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యులను చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా మంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులుగా చేసి ఉన్నత స్థానంలో నిలబెట్టిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, అబుల్ కలాం, కబీర్, లాంటి మహనీయుల ఆశయాలకనుగుణంగా బీసీలను రాజ్యాధికారంలో భాగస్వామ్యులను చేసిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అభివర్ణించారు. తనకు రెండు సార్లు బీఫాం ఇచ్చి ఎమ్మెల్యేగా చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో బీసీ అయిన తాను ఎమ్మెల్యే అయ్యాయని, మరెందరో బీసీ వర్గాలకు మంచి జరిగిందన్నారు. బీసీలు రాజ్యాధికారంలో ఉండాలన్నా.. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ నేతలు మోసపూరిత మాటలతో వస్తారని వారిని నమ్మొద్దన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చంద్రబాబు నాయుడు వాడుకున్నారని తీవ్రంగా విమర్శించారు. బీసీలంటా బ్యాక్ వర్డ్ కాదని, బ్యాక్ బోన్ అని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివర్ణించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మేకల శ్రీను, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు జి. రవికుమార్, నియోజకవర్గంలోని బీసీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు దేవూరి వెంకటేశ్వర్లు, పెన్నా వెంకటేశ్వర్లు, చల్లా సుబ్బరాయుడు, చెరుకూరి చిన కాశయ్య, కొర్రపాటి ఓబులేసు, ఎస్కే లతీఫ్, శ్రీరాం సతీష్, హరిబాబు, కోటేశ్వరమ్మ, నూనె రామచంద్రుడులు మాట్లాడుతూ బీసీలంతా ఐక్యతగా మరింత కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం బీసీల సమైక్యతా నినాదం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర డైరక్టర్లు కొప్పనబోయిన పద్మావతి, సిగా కృష్టారావు, కాకర్ల వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు చింతలపూడి వెంకటేశ్వర్లు, వేల్పుల వెంకటేశ్వర్లు, చింతం శ్రీను, కొడిపిల్ల అంజనేయులు, దాసరి మురళీ, రామనబోయిన శ్రీను, సయ్యద్ నాయబ్ రసూల్, బాలయ్య, కంటు గురవయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే బుర్రా వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

ప్రాణదాత వైఎస్సార్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రాణదాతగా నిలిచారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని 37 మందికి రూ.31 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.3 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశామని, ఆరోగ్యశ్రీ కింద వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేస్తున్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చారని, వైద్యశాలలకు డబ్బులు చెల్లించకపోవడంతో ఆయా వైద్యశాలల్లో అనేక మంది రోగులు తమ ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు. అప్పట్లో సీఎం రిలీఫ్ ఫండ్ కేవలం టీడీపీ కండువా కప్పుకున్న వారికి మాత్రమే దక్కేదని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి లేదని, కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్‌ను విడుదల చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, త్రిపురాంతకం మండల ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కె.జయరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములునాయక్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, దోర్నాల ఉప సర్పంచ్ డి.రసూల్, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, బి.బాలచెన్నయ్య, పబ్బిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్


జీజీహెచ్‌లో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పెళ్లూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదివారం జీజీహెచ్‌లో పరామర్శించారు. చికిత్స పొందుతున్న వైనంపై ఆరా తీశారు. వారితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని జీజీహెచ్ వైద్యులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుచానూరు నుంచి 35 మంది ప్రయాణికులతో షిరిడీ వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు శనివారం అర్ధరాత్రి 2.15 గంటలకు పెళ్లూరులో పెట్రోలు బంకు నుండి రోడ్డు మీదకు వస్తున్న సమయంలో లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తుందన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న 15 నిమిషాల్లోనే పోలీసులు, అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వైద్య బృందం కూడా అప్పటికే ఆసుపత్రిలో సిద్ధంగా ఉండటంతో బాధితులకు సత్వర వైద్య అందించినట్లు తెలిపారు. 15 మందికి స్వల్ప గాయాలు అయ్యాయని ఇద్దరికి కొంతమేర తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని స్పష్టం చేశారు. ప్రయాణికులందరికి భోజన సదుపాయం కల్పించామన్నారు. చికిత్స అనంతరం వారి స్వస్థలాలకు చేరుస్తామన్నారు. ట్రావెల్స్ బస్సు ఫిట్‌నెస్, ఇతర అంశాలపై విచారణ అనంతరం ప్రమాద బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాద స్థలంలో రోడ్డు నిర్మాణ పరమైన లోపాలు ఏమైనా ఉంటే రహదారి భద్రతా కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులతో చర్చించి భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్, ఆర్ఎంఓ తిరుమలరావు, తహసీల్దార్ మురళి తదితరులు ఉన్నారు.

సమ్మెటివ్-1లో టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు

● ఈ నెల 28 నుంచి సమ్మెటివ్ పరీక్ష
● 1-10 తరగతులకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాలు
● మండల కేంద్రాలకు పరీక్ష పేపర్ల సరఫరా
● మొదటిసారి టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు


పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

బేస్తవారిపేట: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) తాజాగా ప్రకటించింది. ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకూ 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ప్రశ్నపత్రాలు సరఫరా చేశారు. ఈసారి టోఫెల్ పరీక్షలకు కూడా ప్రింటెడ్ ప్రశ్నపత్రాలు సరఫరా చేయడం విశేషం. 1 నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు బైలింగ్విష్ విధానంలో, పదో తరగతి విద్యార్థులకు మీడియం వారీగా ప్రశ్నపత్రాలు అందజేస్తారు. ఎస్ఏ-1 పరీక్షలకు విద్యాశాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూఆర్ కోడ్‌ను కేటాయించారు. పేపర్లను ఎవరైనా లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయటపడే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు.

పరీక్షల సమయం ఇలా...

1-5 తరగతులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు

6, 8, 10 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ, 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి.

మొదటిసారి టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు..

ఇంగ్లిష్‌లో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేందుకు ప్రభుత్వం టోఫెల్ విద్యను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు ఉన్న పాఠశాలల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించగా, తొలిసారి ప్రింటెడ్ పేపర్లను ఎస్‌సీఈఆర్‌టీ సరఫరా చేసింది. సాధారణ పరీక్షల మాదిరిగానే ఇకపై టోఫెల్ పరీక్షను ప్రింటెడ్ పేపర్లలో విద్యార్థులు రాయనున్నారు.

మండల కేంద్రాలకు పేపర్ల సరఫరా..

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ద్వారానే ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పరీక్ష పేపర్లను డీసీఈబీ ద్వారా మండల విద్యాకేంద్రాలకు చేరవేశారు. వీటికి సంబంధిత ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు కస్టోడియన్‌లుగా వ్యవహరిస్తారు. పది పబ్లిక్ పరీక్ష పేపర్ల మాదిరిగానే పరీక్షల తేదీల వారీగా ప్రశ్న పత్రాలను ట్రంకు బాక్సుల్లో భద్రపరిచారు.

30,893 మంది హైస్కూల్ విద్యార్థులు:

సమ్మెటివ్-1 పరీక్షను 6-10వ తరగతుల వరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 85,227, ప్రైవేట్ పాఠశాలల్లో 59,426 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 1-5 తరగతుల్లో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 99,200 మంది విద్యార్థులు ఉన్నారు.